సాక్షి
కుమురం భీం
సోమవారం | 15 | ఏప్రిల్ | 2024



బెట్టింగ్ జోరు..!
ఐపీఎల్ మ్యాచ్‌లపై ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ జోరుగా సాగుతోంది. పల్లెలు మొదలుకుని కొన్నేళ్లుగా పట్టణాలకు ఈ సంస్కృతి విస్తరిస్తోంది. 8లో▸



రాజ్యాంగాన్ని కాపాడుకోవాలి
మనకు అన్ని విధాలుగా హక్కులు కల్పించిన రాజ్యాంగాన్ని కాపాడే బాధ్యత మనందరిపై ఉందని మంత్రి సీతక్క అన్నారు. 8లో▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
39.5 /27.8
ఆకాశంలో అక్కడక్కడ మేఘాలు ఉంటాయి. ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. మధ్యాహ్నం తర్వాత వేడి, ఉక్కపోత ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

జార్జిరెడ్డి చరిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్చాలి



నివాళులర్పిస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌రూరల్: విద్యార్థి ఉద్యమ నాయకుడు జార్జిరెడ్డి జీవిత చరిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్చాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతి డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో ఆదివారం జార్జిరెడ్డి వర్ధంతి ఘనంగా నిర్వహించారు. తిరుపతి మాట్లాడుతూ కుల, మతోన్మాద ఫాసిజానికి వ్యతిరేకంగా పోరాటం చేసిన వ్యక్తి జార్జిరెడ్డి అన్నారు. ఆయన చరిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్చేందుకు కృషి చేయాలన్నారు. ప్రభుత్వం పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌లు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఆ సంఘ సహాయ కార్యదర్శులు రత్నం, రోజా, నాయకులు ప్రసాద్, అశ్విని, సంజన, పల్లవి తదితరులు పాల్గొన్నారు.

అగ్నిమాపక వారోత్సవాలు ప్రారంభం



నివాళులర్పిస్తున్న అధికారులు, సిబ్బంది

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలో ఈ నెల 14 నుంచి 20 వరకు అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహించనున్నట్లు లీడింగ్ ఫైర్ అధికారులు సంపత్, సతీశ్ తెలిపారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఫైర్ స్టేషన్ కార్యాలయంలో జెండా ఆవిష్కరించి వారోత్సవాలు ప్రారంభించారు. అగ్నిమాపక శకటాలు, యంత్ర సామగ్రిని ప్రదర్శించారు. వివిధ అగ్ని ప్రమాదాల నివారణ కార్యక్రమాల్లో అమరులైన సిబ్బందికి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ వారం రోజులపాటు అగ్ని ప్రమాదాలు జరిగితే తీసుకోవాల్సిన ప్రాథమిక చర్యలు, నియంత్రణ విధానాలను వివరిస్తూ ప్రజలను చైతన్యవంతం చేయనున్నట్లు తెలిపారు. ముఖ్యంగా బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, పార్కులు, మార్కెట్ ఏరియాలతోపాటు ఎల్‌పీజీ గ్యాస్ వినియోగదారులు, విద్యుత్ వినియోగదారులకు అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిబ్బంది నాగేశ్వర్, విలాస్, కుమారస్వామి, మహేశ్, జనార్దన్, తుల సీదాస్, రాము తదితరులు పాల్గొన్నారు.

కూలీలకు ఊరట!



గోలేటిలోని ఉపాధిహామీ పని ప్రదేశంలో ఏర్పాటు షేడ్‌నెట్

- ఉపాధిహామీ పనుల వద్ద నీడ, తాగునీటి సౌకర్యం
- నిర్వహణ బాధ్యతలు పంచాయతీలకు అప్పగింత
- జిల్లావ్యాప్తంగా జోరుగా కొనసాగుతున్న పనులు

తిర్యాణి(ఆసిఫాబాద్): ఉపాధిహామీ పథకం కూలీలకు ప్రభుత్వం ఊరటనిచ్చే నిర్ణయం తీసుకుంది. ఎండలు దంచికొడుతున్న నేపథ్యంలో కూలీలు సేదదీరేందుకు వీలుగా పని ప్రదేశాల్లో నీడ ఏర్పాటు చేయాలని ఉత్తర్వులు జారీ చేసింది. తాగునీటికి సైతం కూలీలకు చెల్లింపు చేయాలని నిర్ణయించింది. ప్రభుత్వ నిర్ణయంపై జిల్లాలోని ఉపాధి హామీ కూలీలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో పరిస్థితి..
జిల్లావ్యాప్తంగా 15 మండలాల పరిధిలో మొత్తం 1.23 లక్షల ఉపాధిహామీ జాబ్‌కార్డులు ఉన్నాయి. ఇందులో 2.47 లక్షల మంది కూలీలు సభ్యత్వం కలిగి ఉన్నారు. అయితే ఇందులో చాలా మంది పనులకు వెళ్లడం లేదు. గడిచిన 2023- 24 ఆర్థిక సంవత్సరంలోనూ పని ప్రదేశంలో సౌకర్యాల లేక, సిగ్నల్ సమస్యలు, ఇతర కారణాలతో అధికారులు నిర్దేశించుకున్న లక్ష్యం చేరలేదు. 2024- 25 ఆర్థిక సంవత్సరంలో 38,57,940 పని దినాల లక్ష్యం నిర్ణయించారు. ఉపాధిహామీ పనులకు వెళ్లేలా కూలీలను ప్రోత్సహించేందుకు ఇప్పటికే రోజువారీ గరిష్ట కూలి రూ.300 పెంచారు. గతంతో పోలిస్తే ఈ వేసవిలో ఎండల తీవ్రత ఎక్కువగా ఉంటుందనే వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో నీడ, తాగునీటి సౌకర్యాల కల్పనకు చర్యలు చేపట్టారు.

గతంలో ఇలా..
దారిద్య్ర రేఖకు దిగువన ఉన్న పేద కుటుంబాలకు సంవత్సరానికి వందరోజుల పని కల్పించి వలసలు నిరోధించాలనే ఉద్దేశంతో 2005 ఉపాధిహామీ పథకాన్ని ప్రారంభించారు. అప్పట్లో కూలీలకు పని ప్రదేశంలో నీడ కోసం టెంట్, తాగునీరు, ప్రథమ చికిత్స కిట్లు అందుబాటులో ఉంచేవారు. కూలీల పనిముట్లకు అదనంగా చెల్లింపులు చేసేవారు. అలాగే ఐదు కిలోమీటర్ల కంటే ఎక్కువ దూరం వెళ్లి పని చేసేవారికి కిలోమీటర్‌కు కొంతచొప్పున డబ్బులు చెల్లించేవారు. దీంతో ఈ పథకానికి ఆదరణ లభించింది. అప్పటి నుంచి గ్రామాల్లో పనులకు వెళ్లేవారి సంఖ్య క్రమంగా పెరుగుతూ వచ్చింది. అయితే ఆ తర్వాత నుంచి ప్రభుత్వాలు పారదర్శకత పేరుతో పథకం అమలు, నగదు చెల్లింపుల్లో పలు మార్పులకు శ్రీకారం చుట్టాయి. కొన్ని సంవత్సరాలుగా టెంట్, తాగునీటి సౌకర్యం కల్పించడం లేదు. దీనిపై కూలీలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.

మళ్లీ అమలు..
నూతన ఆర్థిక సంవత్సరం 2024- 25 ప్రారంభమైన తర్వాత మళ్లీ ఉపాధిహామీ పనులు జోరందుకున్నాయి. గత ఆర్థిక సంవత్సరంలో వంద రోజుల పని దినాలు పూర్తి చేసుకున్న వారు కూడా పనులకు వెళ్తున్నారు. ప్రస్తుతం పని ప్రదేశాల్లో ఫస్ట్ ఎయిడ్ కిట్లను మినహాయించి టెంట్, తాగునీటి సౌకర్యం కల్పిస్తున్నారు. సౌకర్యాల కల్పన బాధ్యతలను ప్రభుత్వం సంబంధిత గ్రామ పంచాయతీలకు అప్పగించింది. కూలీలకు తాగునీటి సదుపాయం ఏర్పాటు చేసినందుకు గాను ఒక్కో కూలీకి రూ.2.5 చొప్పున పంచాయతీలకు ప్రభుత్వం చెల్లించనుంది. జిల్లాలో పనులు కొనసాగుతున్న అన్ని ప్రాంతాల్లో ఈ సౌకర్యాలు కల్పిస్తున్నామని అధికారులు చెబుతున్నారు. క్షేత్రస్థాయిలో నిర్లక్ష్యం వహించే సిబ్బందిపై జిల్లాస్థాయి అధికారులు కఠినంగా వ్యవహరిస్తున్నారు. ఈ విషయంలో ఇప్పటికే పలువురికి షోకాజ్ నోటీసులు అందించినట్లుగా సమాచారం. కాగా.. వేసవి భత్యం, పనిముట్ల నిర్వహణ భత్యం, ఐదు కిలోమీటర్ల కంటే ఎక్కువ దూరం పనికి వెళ్తున్న వారికి అందించే అదనపు చెల్లింపులు కూడా మళ్లీ పునరుద్ధరించాలని కూలీలు కోరుతున్నారు. పని ప్రదేశంలో గాయపడే అవకాశాలు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో ఫస్ట్ ఎయిడ్ కిట్ కూడా అందుబాటులో ఉంచాలని వేడుకుంటున్నారు.

రెండు వారాలుగా..



ఉపాధిహామీ పథకంలో భాగంగా పనుల వద్ద రెండు వారాలుగా మంచినీటి సదుపాయంతో పాటు పనిచేస్తున్న సమయంలో విశ్రాంతి తీసుకునేందుకు నెట్లు ఏర్పాటు చేస్తున్నారు. దీంతో ఎండ సమయంలో కొద్దిసేపు సేద తీరేందుకు అవకాశం దొరికింది. అలాగే ఫస్ట్ ఎయిడ్ కిట్ కూడా అందుబాటులో ఉంచాలి.

– మహదేవుని విజయ, గోలేటి, మం.రెబ్బెన

అదనపు భత్యం చెల్లించాలి



నీడ, తాగునీటి సదుపాయాలు ఏర్పాటు చేసిన విధంగానే గతంలో అందించిన పలు అదనపు భత్యాలను కూడా చెల్లించాలి. గాయపడిన వారి బాధ్యతను ప్రభుత్వమే తీసుకోవాలి. కూలీలకు ఇన్సూరెన్స్ చేయించి, బాధిత కుటుంబాలను అన్ని విధాలుగా ఆదుకోవాలి.

– దుర్శెట్టి సతీశ్, నాయకపుగూడ, మం.తిర్యాణి

నేటి నుంచి ఎస్‌ఏ– 2 పరీక్షలు

- ఈ నెల 22 వరకు నిర్వహణ
- ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ఏర్పాట్లు పూర్తి
- హాజరు కానున్న 79,314 మంది విద్యార్థులు




జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు

ఆసిఫాబాద్‌రూరల్: 2023- 24 విద్యా సంవత్సరం ముగింపునకు చేరింది. జిల్లాలో ఒకటో తరగతి నుంచి తొమ్మిదో తరగతి విద్యార్థులకు సోమవారం నుంచి సమ్మెటివ్ అసెస్మెంట్(ఎస్‌ఏ- 2) పరీక్షలు ప్రారంభం కానున్నాయి. విద్యాశాఖ ఆధ్వర్యంలో ఇందుకోసం ఇప్పటికే అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ నెల 15 నుంచి ప్రారంభమయ్యే పరీక్షలు 22వ తేదీ వరకు కొనసాగనున్నాయి. విద్యాశాఖ ఇప్పటికే పలుమార్లు పరీక్షల షెడ్యూల్ మార్పులు చేయగా.. ఎండల తీవ్రత నేపథ్యంలో ఉదయమే పరీక్షలు నిర్వహించనున్నారు. ఒకటి నుంచి ఏడో తరగతి వరకు ఉదయం 9 గంటల నుంచి 11.30 గంటల వరకు పరీక్షలు కొనసాగుతాయని అధికారులు పేర్కొన్నారు. 8వ తరగతి విద్యార్థులకు ఉదయం 9 గంటల నుంచి 11.45 వరకు, 9వ తరగతి విద్యార్థులకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు కొనసాగుతాయి. ప్రశ్నపత్రాలను ప్రభుత్వ పాఠశాలలకు పంపిణీ చేసేందుకు అధికారులు కార్యాచరణ రూపొందించారు.

1,252 పాఠశాలలు
జిల్లావ్యాప్తంగా అన్ని యాజమాన్యాల కింద మొత్తం 1,252 పాఠశాలలు ఉన్నాయి. ఇందులో ప్రభుత్వ పాఠశాలలు 684 ఉండగా, 370 గిరిజన ఆశ్రమ పాఠశాలలు, 15 కేజీబీవీలు, 102 ప్రైవేట్ స్కూళ్లు, 33 స్టేట్ ప్రభుత్వ పాఠశాలలు, 10 గిరిజన, సాంఘిక సంక్షేమ గురుకులాలు, ఐదు మహాత్మా జ్యోతిబా పూలే, 31 మైనార్టీ గురుకులాలు, అర్బన్, ఇతర పాఠశాలు ఉన్నాయి. 1వ తరగతి నుంచి 9వ తరగతి వరకు విద్యనభ్యసిస్తున్న వారు 79,314 మంది ఉన్నారు. వీరికి ఈ నెల 15 నుంచి 22 వరకు పరీక్షలు కొనసాగనున్నాయి.

పరీక్షలు ఇలా..
ప్రాథమిక తరగతుల విద్యార్థులకు ఈ నెల 15 నుంచి 19 వరకు ప్రథమ భాష, ఇంగ్లిష్, మ్యాథ్స్, ఈవీఎస్ విషయాల్లో పరీక్షలు ఉంటాయి. అలాగే ప్రాథమికోన్నత పాఠశాలల్లోని 6, 7 తరగతుల విద్యార్థులకు ప్రథమ భాష, ద్వితీయ భాష, తృతీయ భాష ఇంగ్లిష్, గణితం, సాంఘిక శాస్త్రం పరీక్షలు కొనసాగుతాయి. అలాగే 8, 9 తరగతులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ భాషల తర్వాత గణితం, ఫిజికల్, బయాలజికల్ సైన్స్, సోషల్ పరీక్షలు నిర్వహిస్తారు. ఈ నెల 22 వరకు అన్ని తరగతుల పరీక్షలు పూర్తవుతాయి. సంబంధిత ఉపాధ్యాయులు మూల్యాంకనం పూర్తి చేసి 23న విద్యార్థులకు ఎస్‌ఏ- 2కు సంబంధించి ప్రగతి పత్రాలను వారి తల్లిదండ్రుల సమక్షంలో అందజేస్తారు. ఆ తర్వాత ఏప్రిల్ 24 నుంచి జూన్ 11 వరకు వేసవి సెలవులను ప్రభుత్వం ప్రకటించింది. జూన్ 12న పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి.

పకడ్బందీగా నిర్వహించాలి



జిల్లాలో నేటి నుంచి ఈ నెల 22 వరకు నిర్వహించే సమ్మెటివ్ అసెస్మెంట్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి. ప్రోగ్రెస్ కార్డులపై తల్లిదండ్రుల సంతకాలు తీసుకుని వారి సమక్షంలోనే విద్యార్థులకు కార్డులు అందించాలి. వేసవి నేపథ్యంలో విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

– అశోక్, డీఈవో

బెంగాలీల వేడుకలు



పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు

కాగజ్‌నగర్‌రూరల్: సిర్పూర్ నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో ఆదివారం బెంగాలీ ప్రజలు నూతన సంవత్సర వేడుకలు జరుపుకొన్నారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ పూజ, నగర సంకీర్తనలు నిర్వహించారు. కాగజ్‌నగర్ మండలంలోని విలేజ్ నం. 12లో మనోరంజన్ మండల్ నివాసంలో ఏర్పాటు చేసిన పూజా కార్యక్రమంలో ఎమ్మెల్యే హరీశ్‌బాబు పాల్గొన్నారు. నాయకులు అషుతోష్ మండల్, గోవింద్ మండల్, కమల్ సర్కార్ తదితరులతో కలిసి పూజలు చేశారు. అలాగే నజ్రూల్‌నగర్‌లోని వేదమందిరంలో శనివారం రాత్రి నిర్వహించిన సామూహిక పూజ, విలేజ్ నం.2, విలేజ్ నం.5లో నిర్వహించిన శివపూజ, విలేజ్ నం.11లో హరిసభ పూజా కార్యక్రమాలకు ఎమ్మెల్యే హాజరయ్యారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీటీసీ బికాస్ ఘరామి, నాయకులు కాళిదాస్ మజుందార్, రణ్‌వీర్‌బిశ్వాస్, అమిత్ బిశ్వాస్, విజయ్ ఘరామి, సమీర్ గుప్తా, రాకేశ్‌రాయ్ పాల్గొన్నారు.

అంబేడ్కర్ కృషి మరువలేనిది



కలెక్టరేట్‌లో నివాళులర్పిస్తున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, అధికారులు, నాయకులు

- కలెక్టర్ వెంకటేశ్ దోత్రే
- జిల్లా కేంద్రంలో ఘనంగా జయంతి
- నివాళులర్పించిన అధికారులు, ప్రజాప్రతినిధులు

ఆసిఫాబాద్: దేశంలో అసమానతలు రూపుమాపడంలో అంబేడ్కర్ చేసిన కృషి మరువలేనిదని వెంకటేశ్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆదివారం ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి ఘనంగా నిర్వహించారు. అదనపు కలెక్టర్ దాసరి వేణు, డీఆర్వో లోకేశ్వర్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సజీవన్, డీపీవో భిక్షపతి, అదనపు ఎస్పీ ప్రభాకర్‌తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం అంబేద్కర్ ఎంతో పాటుపడ్డారని అన్నారు. యువత ఆయన ఆశయ సాధనకు కృషి చే యాలని సూచించారు. ఉన్నతమైన లక్ష్యాన్ని ఎంచుకుని సాధించే దిశగా క్రమశిక్షణతో ప్రయత్నించాలని, అనుకున్నది సాధించే వరకు ఓర్పుతో ఉండాలని సూచించారు. చదువు చాలా ముఖ్యమైనదని, విద్యను అభ్యసించడంలో అలసత్వం ప్రదర్శించొద్దన్నారు. రాజ్యాంగం పౌరులకు కల్పించిన ఓటుహక్కు ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ నెల 15 వరకు అర్హులైన వారు ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. అనంతరం బస్టాండ్ సమీపంలోని అంబేడ్కర్ విగ్రహానికి కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, ఎమ్మెల్యే కోవ లక్ష్మి, డీసీసీ అధ్యక్షుడు కొక్కిరాల విశ్వప్రసాదరావు, కాంగ్రెస్ నాయకులు అజ్మీరా శ్యామ్‌నాయక్, అంబేడ్కర్ సంఘం నాయకులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రపంచంలోనే అత్యంత విలువైన రాజ్యాంగాన్ని రూపొందించి దేశానికి అందించారని వారు పేర్కొన్నారు. అంతకు ముందు జయంతి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో అంబేడ్కర్ సంఘం నాయకులు అశోక్, తిరుపతి దుర్గే, ముంజం మనోహర్, రేగుంట కేశవరావు మాదిగ, రూప్‌నర్ రమేశ్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి



నివాళులర్పిస్తున విశ్వప్రసాదరావు

‘ఆసరా’ కన్నా అధ్వానం.!

పెన్షన్‌కు పాలు కూడా రావు



ఈ ఫొటోలోని వృద్ధుడిపేరు లక్కర్స్ ఆగయ్య. సింగరేణిలో పనిచేశాడు. తన రక్తాన్ని చెమటగా మార్చి బొగ్గు ఉత్పత్తిలో భాగస్వామి అయ్యాడు. 35 ఏళ్లు పనిచేసి రిటైర్ అయ్యాడు. ప్రస్తుతం ఇతనికి వస్తున్న పెన్షన్ రూ.700. అంటే రోజుకు రూ.25. దాదాపు 20 ఏళ్లుగా ఇదే పెన్షన్‌తో జీవనం సాధిస్తున్నాడు. తనకు వస్తున్న పెన్షన్‌తో నెల పాల బిల్లు కూడా చెల్లించలేకపోతున్నానని ఆగయ్య ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. ప్రభుత్వం వృద్ధాప్య పెన్షన్ రూ.2 వేలు ఇస్తుంటే తనకు మాత్రం 25 ఏళ్లుగా రూ.700 పెన్షనే వస్తుందని తెలిపాడు. ఈ పెన్షన్‌తో ఎలా బతకాలని ప్రశ్నిస్తున్నాడు. పెన్షన్ చాలక ఆసరాకు దరఖాస్తు చేసుకుంటే సింగరేణి పెన్షన్ వస్తుందని ఆసరా పెన్షన్ ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. ప్రతీ రిటైర్డ్ కార్మికుడికి నెలకు రూ.15 వేల పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాడు.



సింగరేణి ప్రధాన కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న రిటైర్డ్ ఉద్యోగులు(ఫైల్)

- బొగ్గుగని కార్మికుల కనీస పెన్షన్ రూ.1000
- 26 ఏళ్ల తర్వాత సవరించిన కేంద్రం
- ఇప్పటికే వెయ్యి దాటిన వారికి పెంపు లేనట్టే..
- పెదవి విరుస్తున్న రిటైర్డ్ ఉద్యోగులు
- ఏళ్లుగా పోరాడినా ఫలితం శూన్యం

శ్రీరాంపూర్: ప్రకృతికి విరుద్ధంగా, భూమి పొరల్లోకి వెళ్లి నల్ల బంగారం వెలికి తీస్తున్న సింగరేణి కార్మికుల పరిస్థితి ఉద్యోగ విరమణ తర్వాత ఆసరా పెన్షన్‌దారుల కన్నా అధ్వానంగా తయారైంది. 26 ఏళ్లుగా రూ.1000 లోపు పెన్షన్ పొందుతున్న రిటైర్డ్ కార్మికుల కనీస పెన్షన్ ఎట్టకేలకు రూ.1000కి పెంచింది కేంద్రం. అయినా.. ఆసరా పెన్షన్‌దారులకన్నా అధ్వానంగా ఉందని రిటైర్డ్ కార్మికులు పెదవి విరుస్తున్నారు. కేంద్రం ఈ నెల 8న విడుదల చేసిన గెజిట్‌పై నిరుత్సాహం వ్యక్తం చేస్తున్నారు. పెన్షన్ పెంపు కోసం ఏళ్లుగా పోరాడుతున్నామని, ఎప్పటికైనా సానుకూల నిర్ణయం రాకపోతుందా అనుకుంటే చివరకు ఆసరా పెన్షన్ కన్నా అధ్వానంగా కనీస పెన్షన్ రూ.1000కి పరిమితం చేసిందని పేర్కొంటున్నారు.

రూ.1000 కన్నా తక్కువ ఉంటేనే..
బొగ్గు గని కార్మికుల కనీస పెన్షన్ ప్రస్తుతం రూ.350గా ఉంది. 23 ఏళ్ల పోరాటం తర్వాత దానిని తాజాగా రూ.1000కి పెంచింది కేంద్రం. ఈ పెంపు రూ.1000 లోపు పెన్షన్ ఉన్న బొగ్గు గని కార్మికులకు మాత్రమే వర్తిస్తుంది. రూ.1001 మించిన బొగ్గు గని కార్మికులకు తాజా పెంపుతో ఎలాంటి ప్రయోజనం ఉండదు.

5 లక్షల మంది పెన్షనర్లు..
ఇక కోలిండియా వ్యాప్తంగా ప్రస్తుతం 5 లక్షల మంది బొగ్గు గని కార్మికులు పెన్షన్ పొందుతున్నారు. వీరిలో 1.20 లక్షల మంది రూ.1000 కన్నా తక్కువ పెన్షన్ పొందుతున్నారు. సింగరేణిలో 20 వేల మందికిపైగా రూ.1000 కన్నా తక్కువ పెన్షన్ పొదుతున్నవారు ఉన్నారు. తాజా పెంపుతో వీరికి మాత్రమే ప్రయోజనం కలుగుతుంది. రూ.1000పైన పెన్షన్ ఉన్న వారికి రూపాయి కూడా లాభం లేదు.

ట్రస్ట్‌లో ఫండ్ సమస్య..
ప్రతీ బొగ్గుగని ఉద్యోగి తన సర్వీసు కాలంలో పెన్షన్ కోసం తన వంతుగా వేతనంలో 7 శాతం పెన్షన్ చెల్లిస్తే దానికి సమానంగా యాజమాన్యం కలిపి సీఎంపీఎఫ్ పెన్షన్ ట్రస్ట్‌కు జమ చేస్తుంది. ఈ పెన్షన్ ట్రస్ట్‌లో ఉన్న డబ్బులను ట్రస్టీ పెంపు చేసి దాని నుంచి పెన్షన్ చెల్లిస్తారు. ఈ పెన్షన్ నిధిని ఎప్పటికప్పుడు పెంపుదల చేస్తూ పెన్షన్ పెంచాల్సి ఉంది. కానీ ప్రస్తుతం ట్రస్ట్ ఫండ్ సమస్యతో కొట్టుమిట్టాడుతుంది. ఉద్యోగుల సంఖ్య తగ్గడం, రిటైర్డ్ అయ్యే వారు పెరగడంతో ట్రస్ట్‌లో నిధి తగ్గుతూ వచ్చింది. ప్రతీనెల ట్రస్ట్‌లో రూ.4,150 కోట్లు జమ అవుతుండగా చెల్లింపు రూ.4,450 కోట్లుగా ఉంది. దీంతో ప్రతీ నెల రూ.300 కోట్లు లోటు ఏర్పడుతుంది. ఈ సమస్యను అధిగమించడానికి జాతీయ సంఘాలు వేజ్‌బోర్డు సమావేశంలో ప్రత్యేక ఒప్పందం చే సుకున్నాయి. ప్రతీ టన్ను బొగ్గు అమ్మకంపై రూ.10 ని ట్రస్ట్‌కు జమ చేయాలని, దీనిని క్రమేణా పెంచాలని నిర్ణయం తీసుకున్నారు. కానీ ఇప్పటికి అదే రూ.10 జమ చేస్తున్నారు. దీంతో పెన్షన్ నిధి పెరగడం లేదు.

ఆసరా కన్నా అధ్వానంగా..
బొగ్గు సంస్థల్లో పనిచేసిన ఉద్యోగుల్లో 6వ వేజ్ బోర్డుకు ముందు దిగిపోయిన వారికి రూ.1000 లోపు పెన్షన్ వస్తుంది. మిగతా వారికి కూడా పెద్దగా పెన్షన్‌రాదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులతో పోల్చితే వారికి వచ్చే పెన్షన్ నాలుగోవంతు కూడా ఉండదు. దేశానికి వెలుగులు పంచిన ఉద్యోగులకు వచ్చే పెన్షన్ ఇంత అధ్వానంగా ఉండటానికి కారణం పాలకులే అని కార్మిక సంఘాలు ఆరోపిస్తున్నాయి. తెలంగాణలో వృద్ధులకు నెలకు రూ.2 వేల ఆసరా పెన్షన్ ఇస్తున్నారు. సింగరేణిలో మాత్రం ఇంత కంటే తక్కువ పొందడం వారి దుస్థితిని తెలియజేస్తుంది.

23 ఏళ్లుగా పోరాటం..
కేంద్రం 1998లో బొగ్గు గని కార్మికుల కోసం ప్రత్యేక చట్టం చేసి పెన్షన్ సదుపాయం కల్పించింది. దీని ప్రకారం ఉద్యోగి రిటైర్ అయ్యే చివరి 10 నెలల బేసిక్‌లో సగటు బేసిక్, వీడీఏను కలిపి దానిపై 25 శాతం పెన్షన్ చెల్లిస్తున్నారు. ఈచట్టం ప్రకారం రెండేళ్లకోసారి పెన్షన్ రివైజ్ చేయాలి. ఇప్పటికీ చేయలేదు. దీంతో పెన్షన్ పెంపు కోసం బొగ్గు గని కార్మికులు 23 ఏళ్లుగా పోరాటం చేస్తున్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా పెన్షన్ పెంచాలని రిటైర్డ్ ఉద్యోగులు పోరాడారు. పెంపు కనీసం 25 నుంచి 40 శాతం ఉంటుందని భావించారు. కానీ చివరకు రూ.1000తో సరిపుచ్చింది.


తీవ్ర అన్యాయం..



పెన్షనర్లకు తీవ్ర అన్యాయం చేశారు. కేవలం కొద్ది మందికి అది కూడా నామమాత్రంగా కనీస పెన్షన్‌ను రూ.వెయ్యి చేశారు. మిగిలిన వారికి ఎలాంటి ప్రయోజనం లేదు. 25 శాతం నుంచి 40 శాతం చేస్తే ప్రయోజనం ఉండేది. ప్రభుత్వ ఉద్యోగులతో పోల్చితే బొగ్గుగనుల్లో పనిచేసిన వారి పెన్షన్ చాలా తక్కువగా ఉంది. దీంతో ఎలా బతికేది.

– ఎ.వేణుమాధవ్, ఆలిండియా పెన్షనర్స్ అసోసియేషన్ సభ్యుడు

మందులకు కూడా చాలవు..



నేను 2005లో దిగిపోయాను. ఇప్పుడు నెలకు పెన్షన్ రూ.1800 వస్తుంది. ఈ డబ్బులు మందులకే చాలడం లేదు. ఇంకా ఏం తిని బతకాలి. ధరలేమో ఆకాశాన్న తాకుతున్నాయి. పెన్షన్ పెంచకుంటే ఎలా బతికేది. కనీసం పెన్షన్ రూ.3 వేలు చేయాలి. అప్పుడే రిటైర్డ్ ఉద్యోగులకు కాస్త ఊరట లభిస్తుంది.

– జి.సత్యనారాయణరావు, రిటైర్డ్ ఉద్యోగి

క్లుప్తంగా

ఇద్దరి రిమాండ్

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలో ఇటీవల ఇద్దరు వ్యక్తులపై హత్యాయత్నానికి పాల్పడిన ఇద్దరు వ్యక్తులను రిమాండ్‌కు తరలించినట్లు వన్‌టౌన్ ఎస్సై ఉదయ్ కుమార్ తెలిపారు. పట్టణానికి చెందిన ముజాయిద్, షాహీద్‌పై కోలిపూరకు చెందిన ఫజిల్, అబ్దుల్ ఆసిల్ గురువారం కత్తులతో దాడికి పాల్పడి తీవ్రంగా గాయపర్చారు. బాధితుల ఫిర్యాదు మేరకు కోలిపూరకు చెందిన ఫజిల్, అబ్దుల్ ఆసిల్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

సెల్‌ఫోన్ దొంగ రిమాండ్

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని తాటిగూడకు చెందిన సాయికుమార్ ఇటీవల సెల్‌ఫోన్ దొంగతనానికి పాల్పడి పరారీలో ఉండగా ఆదివారం పట్టుకుని రిమాండ్‌కు తరలించినట్లు టూటౌన్ సీఐ అశోక్ తెలిపారు. కాలనీలోని ఓ ఇంట్లో మార్చి 25న తెల్లవారుజామున సెల్‌ఫోన్ చోరీ చేశాడు. దొంగతనానికి పాల్పడిన నిందితుడు పరారీలో ఉండగా ఆదివారం అరెస్టు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

జన్నారం: మండలంలోని టీజీపల్లి వద్ద అక్రమంగా తరలించేందుకు సిద్ధంగా ఉన్న రేషన్ బియ్యం పట్టుకున్నట్లు ఎస్సై రాజవర్ధన్ తెలిపారు. లక్సెట్టిపేట సీఐ నరేందర్‌కు వచ్చిన సమాచారం మేరకు పోలీసులను పంపించగా టీజీపల్లిలో బియ్యం లోడ్ చేస్తున్న వాహనం కనిపించింది. 20 క్వింటాళ్ల బియ్యంతో పాటు వాహనాన్ని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

గుడుంబా విక్రయిస్తే కఠిన చర్యలు

కోటపల్లి(చెన్నూర్): గుడుంబా విక్రయించినా తయారు చేసినా కఠినచర్యలు తప్పవని ఎస్సై రాజేందర్ హెచ్చరించారు. ఆదివారం మండలంలోని ఆలుగామలో దాడులు నిర్వహించి 1200 లీటర్ల బెల్లంపాకం, 10లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గుడుంబా వల్ల కుటుంబాలు నాశనం అవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో స్పెషల్‌పార్టీ, సీఆర్పీఎఫ్ పోలీసులు పాల్గొన్నారు.

అలరించిన అష్టావధానం


అష్టావధానంలో పాల్గొన్న కవులు

చెన్నూర్: పట్టణంలోని అయ్యప్పస్వామి ఆలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శతావధాని మారేపల్లి వెంకటపట్వర్ధన్ నేతృత్వంలో ఆదివారం నిర్వహించిన అష్టావధానం అలరించింది. కవులు, రచయితలు పాల్గొని కవితలు సంధించారు. శతావధాని పట్వర్ధన్ తనదైన శైలిలో సమాధానాలు చెప్పారు. కార్యక్రమంలో కవులు, రచయితలు జక్కెపల్లి నాగేశ్వర్‌రావు, మేకల రామస్వామి, దబ్బెట రాజమల్లు, మహావాది సుభాష్, బొడ్డు మహేందర్, వేదాంతం సురేశ్‌బాబు, భాగ్యలక్ష్మి, డాక్టర్ శంకర్‌లాల్ లాహోటి, కొమ్మెర రామ్మూర్తి, పద్మనాభాచా రి, కారెంగుల రామయ్య, పద్యాభిమానులు, తెలుగు భాషాభిమానులు పాల్గొన్నారు.

బెట్టింగ్ జోరు..!



- మంచిర్యాల జిల్లా కేంద్రంలో జోరుగా క్రికెట్ బెట్టింగ్‌లు
- చేతులు మారుతున్న లక్షలాది రూపాయలు
- బార్ అండ్ రెస్టారెంట్లు, లాడ్జీలే అడ్డా
- అంతా ఆన్‌లైన్‌లోనే..

మంచిర్యాలక్రైం: అన్నిరకాల క్రీడల్లో క్రికెట్ అంటే అందరికీ మక్కువ. చిన్నారుల నుంచి మొదలుకుని వృద్ధుల వరకు క్రికెట్ అంటే అభిమానమే. అదే అభిమానంతో ఐపీఎల్ క్రికెట్‌పై యువత నుంచి మొదలుకుని మధ్య వయస్సు వారు సైతం ఆన్‌లైన్ బెట్టింగ్ పెడుతున్నారు. ఉమ్మడి జిల్లాలోని కొన్ని బార్ అండ్ రెస్టారెంట్‌లు, లాడ్జీలను అడ్డాగా చేసుకుని మందు, విందు పార్టీలు ఏర్పాటు చేసుకుని క్రికెట్ చూసుకుంటూ బాల్ టూ బాల్.. వికెట్ టూ వికెట్ అంటూ బెట్టింగ్‌లు పెడుతున్నారు. మరికొందరు రహస్య ప్రాంతాల్లో ఒకేచోట గుమిగూడి సెల్‌ఫోన్లలో క్రికెట్ వీక్షిస్తూ ఆన్‌లైన్ బెట్టింగ్‌లు పెడుతున్నారు. ఇంట్లోనే ఉండి టీవీల ముందు కూర్చుని ఆన్‌లైన్ ద్వారానే బెట్టింగ్ కడుతున్నారు. పల్లెలు మొదలుకుని పట్టణాల వరకు యువత టీవీలు, సెల్‌ఫోన్లకు అతుక్కుపోతున్నారు. ఈ సంస్కృతి కొన్నేళ్లుగా మంచిర్యాల జిల్లా కేంద్రంలోనూ పట్టణాలు, పల్లెల్లోనూ చాపకింద నీరులా విస్తరిస్తోంది. బాల్ టూ బాల్.. వికెట్ టూ వికెట్ అంటూ రూ.100 నుంచి బెట్టింగ్ ప్రారంభిస్తారు. రోజూ ఒక్కో మ్యాచ్‌పై సుమారు రూ.1000 నుంచి ప్రారంభమై రూ.లక్షల్లో బెట్టింగ్ సాగుతోంది. అంతేకాకుండా బార్ అండ్ రెస్టారెంట్లలో పెద్దపెద్ద స్క్రీన్లు ఏర్పాటు చేసి మ్యాచ్ వీక్షించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు సమాచారం.

ఐపీఎల్ అంటేనే బెట్టింగ్ గేమ్

నేడు క్రికెట్ ఆట అంటే అన్ని వర్గాల ప్రజలకు ఎంతో అభిమానం. దీన్ని ఆసరాగా మల్చుకుని కొందరు వ్యాపారం చేస్తున్నారు. కమీషన్లు తీసుకుంటూ బూకీలుగా మారుతున్నారు. ఆన్‌లైన్ ద్వారా బెట్టింగులు నడిపిస్తూ రెండు వర్గాల తరుపున మధ్యవర్తిత్వం చేసి అందిన కాడికి దండుకుంటున్నారు. గూగుల్‌పే, పేటీఎం ద్వారా సులభంగా మనీ ట్రాన్స్‌ఫర్ చేసుకునే అవకాశం ఉన్నందువల్ల ఆన్‌లైన్ ద్వారా లావాదేవీలు జరుపుతున్నారు. గతంలో జిల్లా కేంద్రంలో ఇలాంటి సంఘటనలు వెలుగుచూశాయి. మ్యాచ్‌లు ప్రారంభమైనప్పటి నుంచి ఆడేది ఎవరైనా సరే తమకు నచ్చిన ఆటగాళ్ల గెలుపు ఓటమిపై తమకున్న ఆలోచన విధానంతో బెట్టింగులు పెడుతున్నారు.

యువత పెడదారి..

ఆన్‌లైన్ బెట్టింగ్‌ల ద్వారా యువత పెడ దారి పడుతోంది. గతంలో ఐపీఎల్ బెట్టింగ్‌లు జరిపిన వారే మళ్లీ రంగలోకి దిగినట్లు తెలుస్తోంది. గతంలో జిల్లా కేంద్రంలోని ఓ వార్డులో ఇంట్లో క్రికెట్ బెట్టింగ్ జోరుగా సాగుతోందన్న సమాచారం మేరకు పోలీసులు దాడులు నిర్వహించి ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. జిల్లాలో క్రికెట్ బెట్టింగ్‌లో జోరుగానే సాగుతున్నట్లు సమాచారం. ఇప్పటికైనా పోలీసులు స్పందించి బెట్టింగ్ రాయుళ్లపై చర్యలు తీసుకోవాలని జిల్లా వాసులు కోరుతున్నారు.

- జిల్లా కేంద్రంలోని ఓ కాలనీకి చెందిన యువకుడు ఉన్నత చదువు నిమిత్తం హైదరాబాద్‌కు వెళ్లాడు. అక్కడ స్నేహితులతో కలిసి క్రికెట్ బెట్టింగ్, ఆన్‌లైన్ గేమ్స్‌కు పాల్పడి ఇంట్లో తల్లిదండ్రులకు తెలియకుండా రూ.3లక్షలు అప్పు చేశాడు. విషయం తెలిసిన తల్లిదండ్రులు కొడుకును మందలిస్తే ఆత్మహత్య చేసుకుంటాడేమోనని భయపడి అతను చేసిన అప్పు తిరిగి చెల్లించారు.
- 2023 నవంబర్ 15న ఇండియా వర్సెస్ న్యూజిలాండ్ మ్యాచ్ నడుస్తుండగా మంచిర్యాలకు చెందిన ఓ సింగరేణి ఉద్యోగి కుమారుడు ఇంట్లో నుంచి రూ.50 వేలు తీసుకెళ్లి బెట్టింగ్‌కు పాల్పడ్డాడు. విషయం ఇంట్లో తెలియడంతో మందలించారు. దీంతో మనస్తాపానికి గురైన యువకుడు రైలు కిందపడి ఆత్మహత్య చేసుకునేందుకు యత్నించగా కుటుంబ సభ్యులు గమనించి కాపాడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కానీ ఈ విషయం పోలీసుల దృష్టికి వెళ్లలేదు.

పలువురిపై కేసు నమోదు


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ గంగారెడ్డి

నిర్మల్‌టౌన్: ఐపీఎల్ బెట్టింగ్ ఆడిన వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి తెలిపారు. ఆదివారం జిల్లా కేంద్రంలో వివరాలు వెల్లడించారు. జిల్లా కేంద్రానికి చెందిన మణికంఠ, చిలమంతుల శివచారి భైంసాకు చెందిన రెహమాన్ ద్వారా ఆన్‌లైన్‌లో వెబ్‌సైట్, ఐడీ క్రియేట్ చేసుకున్నారు. డబ్బులను కైన్లుగా మార్చి యూజర్ ఐడీలో పెట్టి బెట్టింగ్ ఆడుతున్నామని కస్టమర్లకు చెప్పారు. కస్టమర్లకు కూడా ఐడీ క్రియేట్ చేసి ఆడిపిస్తామని తెలిపారు. పక్కా సమాచారం మేరకు పోలీసులు పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రూ.14,170 నగదు, 4 ఫోన్లు, 1 ఏటీఎం కార్డు స్వాధీనం చేసుకున్నారు. సమావేశంలో పట్టణ సీఐ అనిల్ కుమార్ పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు చుక్కల దుప్పి మృతి


మృతి చెందిన చుక్కల దుప్పి

రెబ్బెన(ఆసిఫాబాద్): మండలంలోని గోలేటి టౌన్‌షిప్‌లో గల భీమన్న స్టేడియం సమీపంలో ఆదివారం తెల్లవారు జామున ప్రమాదవశాత్తు చుక్కల దుప్పి మృతి చెందింది. స్థానికుల కథనం ప్రకారం అటవీ ప్రాంతం నుంచి బయటకు వచ్చిన చుక్కల దుప్పిని వేటకుక్కలు వెంబడించడంతో స్టేడియం వైపు పరుగులు తీసింది. ఈ క్రమంలోఇనుప ఫెన్సింగ్ పై నుంచి దూకే క్రమంలో వైర్ల మధ్యలో పడి మృతి చెందింది. వాకర్లు దుప్పిని గమనించి అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. దుప్పి కళేబరాన్ని గోలేటి వన్ అటవీ ప్రాంతానికి తీసుకెళ్లి దహనం చేశారు. ఈ కార్యక్రమంలో బీట్ అధికారులు రవి, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

రైలులో మహిళ మృతి


మృతి చెందిన లక్ష్మీదేవి

మంచిర్యాలక్రైం: రైలులో ప్రయాణిస్తున్న ఓ మహిళ అనారోగ్యంతో మృతి చెందినట్లు జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ రాజేశ్వర్ తెలిపారు. కడప జిల్లా శాంత కొవ్వూర్ గ్రామానికి చందిన పడమటింటి లక్ష్మీదేవి(36)కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. ఈ క్రమంలో ఈ నెల 12న సోమగూడెం కల్వరి చర్చికి కుటుంబ సభ్యులతో వచ్చింది. 13, 14న ప్రార్థనలు ముగించుకుని స్వగ్రామానికి గోరఖ్‌పూర్ ఎక్స్‌ప్రెస్‌లో వెళ్తుండగా మందమర్రి సమీపంలో తీవ్ర అస్వస్థతకు గురై మృతి చెందింది. జీఆర్పీ పోలీసులు మృతదేహాన్ని మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

తేనెకోసం వెళ్లి ఒకరు మృతి

పెంబి: కుటుంబ పోషణకు తేనె సేకరణకోసం వెళ్లి ఒక రు మృతి చెందిన సంఘట న మండలంలో చోటు చే సుకుంది. ఎస్సై శంకర్ తెలి పిన వివరాల ప్రకారం మండలంలోని మందపల్లి గ్రా మానికి చెందిన నెముల్ల రాజేందర్ (35)అదే గ్రా మానికి చెందిన బొజ్జ రాజన్న, బొజ్జ భీమన్న, దేశవే ణి పెద్దులుతో కలిసి శనివారం రాత్రి సబ్‌స్టేషన్ వద్ద ఉన్న రావిచెట్టుపై తేనె తీసేందుకు వెళ్లారు. చెట్టు కొ మ్మ విరిగి కిందపడడంతో తీవ్ర రక్తస్రావం జరిగి అ క్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్ద రు కుమారులు ఉన్నారు. భార్య నముల్ల గంగవ్వ ఆదివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.


రాజేందర్(ఫైల్)

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య


వెంకటేశ్వర్లు (ఫైల్)

మంచిర్యాలక్రైం: ఈ నెల 13న గుర్తు తెలియని రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు జీఆర్పీ హెడ్‌కానిస్టేబుల్ సంపత్‌కుమార్ తెలిపారు. కరీంనగర్ జిల్లా సైదాపూర్‌కు చెందిన ఇల్లందుల వెంకటేశ్వర్లు (34) మంచిర్యాలలోని బంధువుల ఇంటికి వచ్చాడు. స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలో గుర్తు తెలియని రైలు కింద పడి ఆత్మహత్యకు యత్నించగా తీవ్ర గాయాలపాలయ్యాడు. చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతునికి భార్య శ్రీలేఖ, కూతురు అక్షర, కుమారుడు మణికరణ్ ఉన్నారు. శ్రీ లేఖ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

మద్యానికి బానిసై ఆత్మహత్య


మల్లేశ్ (ఫైల్)

బెల్లంపల్లి: మద్యానికి బానిసైన ఒకరు రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నట్లు బెల్లంపల్లి జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ కె.సురేష్‌గౌడ్ తెలిపారు. కాసిపేట మండలం పెద్దనపల్లి గ్రామానికి చెందిన బన్న మల్లేశ్ (49)కూలి పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో మద్యానికి బానిసయ్యాడు. ఆదివారం తెల్లకల్లు తాగేందుకు ఇంట్లో నుంచి బయలుదేరాడు. మందమర్రి-కల్వరీ చర్చి మధ్యలో గుర్తు తెలియని రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతునికి తల్లి బానమ్మ , భార్య ఇందుమతి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మంచిర్యాల జీఆర్పీ ఎస్సై సుధాకర్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

తండ్రి చితికి నిప్పంటించిన కూతురు

కాసిపేట: మండలంలోని సోమగూడెం పాతబస్తీకి చెందిన బన్న మల్లేశ్ ఆదివారం రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతునికి ఇద్దరు కుమార్తెలు సంతానం. రాత్రి అంత్యక్రియలు నిర్వహించగా పెద్ద కూతురు రేష్మా తండ్రి చితికి నిప్పు పెట్టి అందర్నీ కంటతడి పెట్టించింది.


నిప్పు పట్టుకున్న రేష్మా

నగదు పట్టివేత


పట్టుబడిన నగదుతో ఎస్సై రాములు

నేరడిగొండ(బోథ్): బోథ్ మండలంలోని ఘన్‌పూర్ చెక్‌పోస్టు వద్ద ఆదివారం నిర్వహించిన తనిఖీల్లో రూ.85 వేల నగదు పట్టుకున్నట్లు ఎస్సై రాములు తెలిపారు. మహారాష్ట్రలోని యవత్మాల్ జిల్లా డిగ్రస్ గ్రామానికి చెందిన పాండురంగ్ తన ఆటో ఫైనాన్స్ కట్టడానికి రూ.85 వేలు వెంట తీసుకుని నిజామాబాద్ వైపు వెళ్తున్నాడు. నగదుకు సంబంధించి ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో సీజ్ చేసినట్లు ఎస్సై తెలిపారు. తనిఖీల్లో ఎఫ్ఎస్‌టీ టీం సభ్యులు ప్రమోద్‌రెడ్డి, ఏఎస్సై గంగారెడ్డి, కానిస్టేబుళ్లు నాగు, శేషురావు, మోహన్, తదితరులు పాల్గొన్నారు.

నగదు పట్టివేత

కాగజ్‌నగర్ రూరల్: మండలంలోని వంజీరి చెక్‌పోస్టు వద్ద ఆదివారం నిర్వహించిన వాహనాల తనిఖీలో రూ.1,80,000 నగదు పట్టుబడినట్లు ఎస్సై సోనియా తెలిపారు. నగదుకు సంబంధించి ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో స్వాధీనం చేసుకుని ఫ్లయింగ్ స్క్వాడ్‌కు అప్పగించినట్లు పేర్కొన్నారు.

ఇసుక లారీ పట్టివేత

తాండూర్: ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న లారీని పట్టుకున్నట్లు ఎస్సై జగదీశ్వర్ గౌడ్ తెలిపారు. ఆదివారం రెబ్బెన మండలం నుంచి మంచిర్యాలకు ఇసుక లోడుతో వెళ్తున్న లారీని బోయపల్లి గ్రామ శివారులో పట్టుకున్నారు. అనుమతి పత్రాలు, బిల్లులు లేకపోవడంతో లారీని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

మట్కారాయుళ్ల అరెస్ట్

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని దివ్య లాడ్జిలో ఆన్‌లైన్‌లో మట్కా ఆడుతున్న నలుగురు వ్యక్తులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ బన్సీలాల్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు ఆదివారం లాడ్జీపై దాడి చేసి బెల్లంపల్లి టేకులబస్తీకి చెందిన నేర్ల రవికుమార్, దువ్వె నితీష్, కల్లపెల్లి శశి, దేవరకొండ సతీష్‌లను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.2వేల నగదు, 4 సెల్‌ఫోన్లు, మట్కా చార్ట్స్ స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

గంజాయి పట్టివేత


పోలీసుల అదుపులో నిందితులు

నార్నూర్: గాదిగూడ మండలంలోని లోకారి(బి)లో ఆదివారం ఎస్సై మహేష్ కుమార్ ప్రత్యేక ఆపరేషన్ నిర్వహించారు. గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తుల వద్ద నుంచి రూ.30వేల విలువచేసే 1.2 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని నిందితులను రిమాండ్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్పీ గౌస్ ఆలం, ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్, సీఐ రహీంపాషా ఆదేశాల మేరకు గంజాయిపై ప్రత్యేక ఆపరేషన్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

అసత్య వార్తలపై ఉక్కుపాదం

- మిత్ వర్సెస్ రియాల్టీ పేరిట ప్రత్యేక వెబ్ పేజీ రూపొందించిన ఎన్నికల సంఘం

నేరడిగొండ(బోథ్): పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు వేయకుంటే మీ ఖాతా నుంచి లేదా మొబైల్ రీచార్జి నుంచి ఎన్నికల సంఘం రూ.350 కోత విధిస్తుందనే అసత్య ప్రచారం కొంతకాలంగా వైరల్ అవుతోంది. ఇది అసత్యమే అని తెలిసినా సోషల్ మీడియాలో షేర్ చేస్తూనే ఉన్నారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఇలాంటి అసత్య ప్రచారాలకు అడ్డుకట్ట వేయాలనే ఉద్దేశంతో ఎన్నికల సంఘం 'మిత్ వర్సెస్ రియాలిటీ' పేరుతో వెబ్ సైట్ రూపొందించింది. దీనిని ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్, కమిషనర్లు జ్ఞానేశ్ కుమార్, సుఖ్ బీర్ సింగ్ సంధు ప్రారంభించారు. ఏదైనా సమాచారం తెలిసినప్పుడు వాస్తవమా? కాదా.. తెలుసుకోవడానికి పూర్తి వివరాలతో హ్యాండ్ బుక్ పీడీఎఫ్ ఫైల్స్ అందుబాటులో ఉంచింది. వీటిని డౌన్‌లోడ్ చేసుకుని సమాచారం తెలుసుకోవచ్చు. అలాంటి వార్తలను నిత్యం పర్యవేక్షిస్తూ బాధ్యులపై చర్యలు తీసుకోవడమే కాక అలాంటి అసత్య వార్తలను వెబ్‌పేజీల్లో ఉంచి ఇతరులను అప్రమత్తం చేస్తుంది. ఎన్నికల సంఘం https:///mythvsreality.eci.gov.in రూపొందించిన పేజీ ఇదే.

పొందుపర్చిన ఉదాహరణలు..

అసత్యం: ఓటరు లిస్టులో పేరు లేదని గుర్తించినప్పుడు ఆధార్, ఓటరుకార్డు చూపించి సెక్షన్ 49ఎ కింద ఛాలెంజ్ ఓటు అడిగి వినియోగించుకోవచ్చు.
నిజం: ఓటరు జాబితాలో పేరు లేని వ్యక్తి ఎలాంటి గుర్తింపు కార్డులు చూపించినా ఓటు వేయడానికి వీలు లేదు. ఓటరు జాబితాలో పేరుంటేనే ఓటు హక్కును వినియోగించుకోవచ్చు.
అసత్యం: ఓటరు లిస్టులో పేరు లేనప్పుడు.. పోలింగ్ కేంద్రానికి రెండు ఫొటోలు తీసుకొని వెళ్లి ఫారం –8 నింపి ఓటు వేయవచ్చు.
నిజం: ఓటరు జాబితాలో నమోదు చేయబడి ఉండాలి. ఎన్నికలు పూర్తయ్యే వరకు ఎలాంటి సవరణలు అనుమతించబడవు. పోలింగ్ రోజున జాబితాలో వ్యక్తి పేరు చేర్చడం లేదా ఓటు వేయడానికి అనుమతి ఇవ్వడం ఉండదు.

అంబేద్కర్ అందరివాడు

- జీఎం సంజీవరెడ్డి


విగ్రహానికి పూలమాలలు వేస్తున్న జీఎం

శ్రీరాంపూర్(మంచిర్యాల): అంబేద్కర్ అందరివాడని శ్రీరాంపూర్ జీఎం బీ.సంజీవరెడ్డి అన్నారు. ఆదివారం శ్రీరాంపూర్ జీఎం కార్యాలయం వద్ద అంబేద్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కాన్ఫరెన్స్ హాల్లో జరిగిన కార్యక్రమంలో మాట్లాడారు. ఇటీవల నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో గుర్తింపు సంఘం ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ బాజీసైదా, అధికారుల సంఘం బ్రాంచ్ కార్యదర్శి చంద్రశేఖర్, ఏరియా ఎస్‌వోటూ జీఎం పురుషోత్తంరెడ్డి, డీజీఎం(పర్సనల్) అరవిందరావు, ఏరియా ఇంజనీర్ చంద్రశేఖర్ రెడ్డి, డీజీఎం (సివిల్) ఆనంద్ కుమార్, ఎస్సీ లైజనింగ్ అధికారి కిరణ్ కుమార్, ఎస్టీ లైజనింగ్ అధికారి రాము, ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ నాయకులు ప్రవీణ్, ఎస్ కుమార్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీపీపీలో...

జైపూర్: మండల కేంద్రంలోని సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటులో అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్టీపీపీ ఆడిటోరియం నుంచి పెగడపల్లి వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఎస్టీపీపీ సీటీసీ బసివిరెడ్డి వోఅండ్ఎం చీఫ్ జెన్‌సింగ్, ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షులు దరావత్ పంతులానాయక్, అధికారులతో కలిసి పెగడపల్లిలో అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆడిటోరియంలో కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి అధ్యక్షురాలు భవాని, ఎస్టీపీపీ ఏజీఎంలు సుధాకర్, ప్రసాద్, రమణ, మదన్మోహన్, ఎస్సీ లైసెనింగ్ అధికారి వెంకటయ్య, ఎస్టీ లైసెనింగ్ అధికారి భీమా, సీఎంవోఏఐ అధ్యక్షులు సముద్రాల, ఏఐటీయూసీ పిట్ కార్యదర్శి సత్యనారాయణరెడ్డి, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

కోల్‌కారిడార్ ఏర్పాటుకు కృషి



మాట్లాడుతున్న జనక్ ప్రసాద్

శ్రీరాంపూర్: సింగరేణి ప్రాంతాలను కలుపుతూ కోల్‌కారిడార్‌ను ఏర్పాటు చేస్తామని ఐఎన్టీయూసీ సెక్రెటరీ జనరల్ బీ.జనక్‌ప్రసాద్ తెలిపారు. ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సింగరేణిలో కొత్త గనుల ఏర్పాటు కోసం ఇప్పటికే తమ యూనియన్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి, డెప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, కోల్ సెక్రెటరీ మీరాను కలిశామన్నారు. సమావేశంలో ఆ యూనియన్ బ్రాంచి ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్‌రావు, జాతీయ సమితి సభ్యులు సీహెచ్ భీంరావు, కేంద్ర కమిటీ ఉపాధ్యక్షులు గరిగే స్వామి, కలవేన శ్యాం, నాయకులు తిరుపతి, వెంగళ కుమారస్వామి, ల్యాగల శ్రీనివాస్ పాల్గొన్నారు.

ట్యాంకర్ ద్వారా తాగునీటి సరఫరా



ఇంద్రవెల్లి: మండల కేంద్రంలోని ఇంద్రాదేవి ఆలయంలో నెలకొన్న నీటి సమస్యపై 'ఇంద్రాదేవి ఆలయం.. సమస్యలమయం' శీర్షికన సాక్షిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఆదివారం భక్తులు భారీ సంఖ్యలో రావడంతో గ్రామ పంచాయతీ అధికారులు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ఇంద్రాదేవి ఆలయానికి సందర్శించి నీటి సమస్యపై ఆరా తీశారు. ట్యాంకర్ ద్వారా భక్తులకు నీటిని సరఫరా చేశారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ భానుకుమార్, ఎంపీవో జీవన్, భక్తులు పాల్గొన్నారు.

చేపల వేటకు వెళ్లి తిరిగిరాని లోకాలకు..

- విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి


రాజేశ్(ఫైల్)

జన్నారం: చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై రాజవర్ధన్, మృతుని కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం జన్నారం మండలం ఇప్పలపల్లి గ్రామానికి చెందిన తాళ్లపెల్లి రాజేశ్ (28) ఆదివారం సెలవుదినం కావడంతో తన స్నేహితులతో కలిసి చేపలు పట్టేందుకు సమీపంలోని గోదావరి వద్దకు వెళ్లారు. చేపలు పట్టే క్రమంలో రాజేశ్ విద్యుత్ వైర్ జాయింట్ చేస్తూ నీటిలో దిగుతుండగా బెడద కృష్ణయ్య విద్యుత్ మోటర్ స్టార్టర్‌లో వైర్లు పెట్టి ఆన్ చేశాడు. ఈ క్రమంలో రాజేశ్ విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. మృతునికి భార్య తేజస్విని, ఇద్దరు కూతుర్లు ఉన్నారు. తేజస్విని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు. విషయం తెలుసుకున్న లక్సెట్టిపేట సీఐ అల్లం నరేందర్ సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.



కడెం: మండలంలోని పెద్దూర్‌తండా సమీపంలో స్మగ్లర్లు రోడ్డు పక్కనే ఉన్న టేకు చెట్టును నరికి ఎత్తుకెళ్లారు. కలప స్మగ్లర్లను కట్టడి చేయడంలో అటవీ అధికారులు విఫలమవుతున్నారు. రోడ్ల వెంబడే ఇలా ఉంటే ఇక అటవీ ప్రాంతంలో పరిస్థితి ఎలా ఉంటుందోనని, స్మగ్లర్లపై కఠినచర్యలు తీసుకోవాలని ప్రకృతి ప్రేమికులు కోరుతున్నారు.